# వార సంతలో వసతులు కరువు

- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు
- పట్టించుకోని జీపీ సిబ్బంది


సంతలో కూరగాయల విక్రయిస్తున్న వ్యాపారులు

బచ్చన్నపేట : మండల కేంద్రంలో బచ్చన్నపేట నుంచి ఆలేరు వెళ్లే రహదారిపై ప్రతి ఆదివారం వారాంతపు సంత నడుస్తుంది. సంతలో కూరగాయలను విక్రయించడానికి సిద్దిపేట, జనగామ, చేర్యాల, ఆలేరు పట్టణాలను నుంచి వ్యాపారులు వచ్చి ఇక్కడ పలు రకాల వస్తువులను విక్రయిస్తారు. అలాగే కూరగాయలు పండించిన రైతులు కూడా చుట్టుపక్కల గ్రామాలు, మండలాల నుంచి వస్తారు. ఇక్కడ తాజా కూరగాయలు లభిస్తుండడంతో చేర్యాల, ఆలేరు, రాజపేట మండలాల నుంచి చాలా మంది వచ్చి ఇక్కడ సరుకులు కొనుగోలు చేస్తారు. అలాగే ప్రతి ఆదివారం పశువులను, జీవాలను కూడా విక్రయిస్తుండడంతో సంతకు వచ్చిన వారు కూడా ఇక్కడ కూరగాయలను కొనుగోలు చేసి వెళ్తారు. మేన్ రోడ్డుపై సంతను నిర్వహిస్తుండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంతలో మహిళలకు అందుబాటులో మూత్రశాలలు లేక పోవడంతో బహిర్భూమికి వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నుండిచి పలు పట్టణాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్షల్లో పన్నులను వసూలు చేసే అధికారులు మాత్రం ఇక్కడి వసతులను మర్చిపోతున్నారు.

### ఆదాయం ఉన్నా.. వసతులు లేవు



సంతలో కూరగాయలను కొనుగోలు చేయడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి ఎక్కువగా మహిళలే వస్తుంటారు. మూత్ర శాలలు లేక అవస్థలు పడుతున్నాం. సంత ఆదాయం మీద ఉన్న యావ వసతుల కల్పనపై లేకపోయింది. ఏళ్ల తరబడి నడుస్తున్నా సంత గురించి ఇప్పటి వరకు పట్టించుకున్న నాథుడే లేరు. – ఎద్దు లక్ష్మి, ఎద్దుగూడెం

### నీడ వసతి లేదు



మండల కేంద్రంలో వారంతపు సంతలో ప్రతి వారం కూరగాయలను విక్రయిస్తాను. రోడ్డు పక్కన దుకాణం పెట్టుకున్నందుకు జీపీ అధికారులు వచ్చి అడ్డా కిరాయి డబ్బులను తీసుకొని వెళ్తారు. కానీ సంతకు వచ్చిన వారికి తాగునీరు, నీడ వసతి లాంటి వాటిని మాత్రం పట్టించుకోరు. – బోయిని ఎల్లమ్మ, పోచన్నపేట

## ఘనంగా విష్ణుదుర్గాదేవి బోనాల మహోత్సవం


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లిలో మూడో ఏడాది నిర్వహించే శ్రీవిష్ణుదుర్గాదేవి బోనాల మహోత్సవాన్ని ఆదివారం అర్చకులు బంగిమఠం సార్థిక్ వేదమంత్రాల మధ్య నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు. ముందుగా దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి బొడ్రాయికి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులందరికీ దుర్గామాత ఆశీస్సులు ఉండాలని అన్నారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

**కోచింగ్ అకాడమీ నిర్వాహకుల అన్నదానం**

దుర్గామాత బోనాల సందర్భంగా గ్రామానికి చెందిన హైదరాబాద్‌లో విష్ణు ఐఏఎస్ కోచింగ్ అకాడమీ సెంటర్ నిర్వహిస్తున్న పొగాకుల విష్ణువర్ధన్‌గౌడ్–సుష్మ, యాదగిరి–అనసూర్య, తాళ్లపల్లి వాణిశ్రీ–శ్యాంకుమార్ దంపతులు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో చిల్పూరు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎంపీపీ సరితబాలరాజు, సర్పంచ్‌లు లింగారెడ్డి, లొడెం రజితరవీందర్, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, ఎంపీటీసీ అయిలమ్మ, నాయకులు కొయ్యడ రాందాసు, శ్రీనివాస్‌గౌడ్, రంగు రమేష్, గొంగిడి కృష్ణమూర్తి, రంగు హరీష్, ఉడుత వెంకన్న, వేణు, గుర్రపు వెంకటేశ్వర్లు, కొయ్యడ శ్రీధర్, మోతె రాజు, రజనీకాంత్, సాంబరాజు, సమ్మయ్య, రాజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ చర్చిలో కడియం అభిమానుల ప్రార్థనలు



స్టేషన్‌ఘన్‌పూర్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా కడియం శ్రీహరి గెలుపొందగా స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కడియం శ్రీహరి అభిమానులు ఆదివారం ప్రసిద్ధ మెదక్ చర్చిలో ప్రార్థనలు చేశారు. ప్రార్థనలు చేసిన సింగపురం రవి, సింగపురం కమలాకర్ తదితరులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కడియం గెలుపొందితే మెదక్ చర్చిలో మొక్కులు చెల్లిస్తామని ఎన్నికలకు ముందు ఏసుప్రభును మొక్కుకున్నామన్నారు. శ్రీహరి విజయం సాధించడంతో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య సహకారంతో ఎస్సీ కాలనీ నుంచి 16 మంది కడియం అభిమానులు మెదక్ చర్చిలో మొక్కులు చెల్లించుకున్నామన్నారు. కార్యక్రమంలో చింత సురేష్, బి.రవి, ఆర్. రవి, చింత జోజి, ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ మండల కమిటీ


ఆటో యూనియన్ నూతన కమిటీ బాధ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండల ఆటో యూనియన్ నూతన కమిటీని మండలంలోని వివిధ గ్రామాల ఆటోల యజమానులు, డ్రైవర్ల సమక్షంలో ఆదివారం డివిజన్ కేంద్రంలో ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా శివునిపల్లికి చెందిన గుర్రం మధు, ప్రధాన కార్యదర్శి నీల మొగిలి, ఉపాధ్యక్షులు సింగపురం జోజి, కార్యదర్శి గజ్వెల్లి దయాకర్, సహాయ కార్యదర్శి వి.శ్రీనివాస్, కోశాధికారిగా బాస్కుల సమ్మయ్య, ముఖ్య సలహాదారులుగా రాజారపు జయపాల్, ఎండీ.అన్వర్, నీల రవి, చింత యాదగిరి, చింత ప్రవీణ్‌కుమార్, ఇప్పగూడెం అశోక్, సలహా సభ్యులుగా గాదె అనీల్, గుండె మహేందర్, లక్ష్మీనారాయణ, గణేష్, కిషన్, భిక్షపతి, అఖిల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గుర్రం మధు మాట్లాడుతూ నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఆటో యజమానులు, డ్రైవర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవతో కృషి చేస్తానని, ఆటో కార్మికులకు అనునిత్యం అందుబాటులో ఉంటానన్నారు.

## ఇందిర ఆదేశాల మేరకే పదవులు


సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌యాదవ్

చిల్పూరు: నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకే పదవులు ఉంటాయని దీన్ని పార్టీలో ప్రతి ఒక్కరూ పాటించాలని కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ తీగల మహేందర్‌యాదవ్ అన్నారు. మండలంలోని లింగంపల్లి, శ్రీపతిపల్లి గ్రామాల్లో ఆదివారం పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. ముందుగా లింగంపల్లిలో సమ్మక్క సారలమ్మల గద్దెల వద్ద, అనంతరం శ్రీపతిపల్లిలో దుర్గామాత వద్ద పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక కోసం కసరత్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆశావహుల పేర్లను ఇన్‌చార్జ్ ఇందిరకు అందజేయడం జరుగుతుందని తుది నిర్ణయం వారే ప్రకటిస్తారని అన్నారు. ఈ విషయంలో ఎవరూ పైరవీలు చేయరాదని సూచించారు. సమావేశంలో ఎంపీటీసీలు కుమార్, పాశం శిరీషసురేష్, నాయకులు దుర్గాప్రసాద్, లవన్‌కుమార్, మూల నాగరాజు, తొటి సునీల్, మహేందర్, రజని, శోభ, సుప్రియ, కండ్లకోలు బాలరాజు, లక్ష్మణ్, కర్ణాకర్ తదితరులు ఉన్నారు.

## నిరుపయోగంగా మరుగుదొడ్లు


అధ్వానంగా పురుషుల మరుగుదొడ్లు, తాళం వేసి ఉన్న స్త్రీల మరుగుదొడ్డి, పగిలిన తలుపు

జనగామ రూరల్: పట్టణంలో బతుకమ్మ కుంటలో మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. లక్షలు ఖర్చు పెట్టి నిర్మాణం చేపట్టి గాలికి వదిలేశారు. జిల్లా కేంద్రంలోని దుర్గమ్మ టెంపుల్ దగ్గర ఉండడం పట్టణవాసులకు సాయంత్రం వేళ సేద తీరే ప్రాంతం కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రతి రోజు పట్టణ ప్రజలు వాకర్స్ ఉదయం నడుస్తూ వ్యాయామాలు చేస్తుంటారు. వారికి అక్కడికి వచ్చే ప్రజలకు అత్యవసరంగా ఉపయోగించుకోవడానికి అందుబాటులో ఉండేలా నిర్మించిన మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేక అస్తవ్యస్తంగా ఉన్నాయి. స్త్రీల కోసం నిర్మించిన మరుగుదొడ్డికి తాళం వేసి ఉండి డోర్‌ను పగలగొట్టి ఉంది. ఏ ప్రజాప్రతి నిధి వచ్చినా బతుకమ్మ కుంటను తీర్చిదిద్దుతా మని గొప్పలు చెప్పుకోవడం కాకుండా కనీస అవసరాలు ఉండేలా మంచినీటి సదుపాయం, రాత్రి వేళ వి ద్యుత్, మరుగుదొడ్ల నిర్వహణతో పాటు ఇతర సౌ కర్యాలు కల్పించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

### ఇనుపరాతి గుట్టలను రక్షించుకోవాలి

ధర్మసాగర్ : ఉమ్మడి వరంగల్ జిల్లా ఊపిరితిత్తులుగా భావించే ఇనుపరాతి గుట్టలను పరిరక్షించుకోవాలని విశ్రాంత అటవీ శాఖ అధికారి పురుషోత్తం అన్నారు. అటవీశాఖ, జనవిజ్ఞాన వేదిక, పర్యావరణ పరిరక్షణ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ధర్మసాగర్ జిల్లా పరిషత్ బాలుర సెకండరీ పాఠశాల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు ఆదివారం గ్రామ శివారులోని ఇనుపరాతి గుట్టల్లో ట్రెక్కింగ్ నిర్వహించారు. హెచ్‌ఎం ధర్మప్రకాష్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు సురేష్ సమన్వయం చేశారు. పురుషోత్తం మాట్లాడు తూ అడవుల అభివృద్ధికి, ఉత్పత్తి శ్రేణుల జీవనానికి ప్రధాన వనరులు ప్రజా జీవనంతో నిత్య సంబంధం కలిగి ఉంటాయని తెలిపారు. వీటిని పరిరక్షించుకోవడం అందరి సమష్టి బాధ్యత అని పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### ఎమ్మెల్యే కడియంను కలిసిన యూత్ బాధ్యులు



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లుకు చెందిన స్వాగత్ యూత్ అసోసియేషన్ బాధ్యులు సర్పంచ్ పోగుల సారంగపాణి ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కడియంకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జనవరి 12, 13, 14వ తేదీల్లో ఛాగల్లులో స్వాగత్‌యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌కు సహాయ సహకారాలు అందించాలని కోరగా అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉపసర్పంచ్ పొన్న రజితరాజేష్, స్వాగత్ యూత్ అధ్యక్షుడు కూన రాజు, కడియం యువసేన అధ్యక్షుడు అన్నెపు కుమార్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి చేయూత



రఘునాథపల్లి: మండలంలోని భానాజీపేటలో చాట్ల వెంకటయ్య (46) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పేదరికానికి చెందిన బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పగిడిపల్లి కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు 50 కేజీల బియ్యం అందజేశారు.

### ఆరోగ్యంపై అశ్రద్ధ చేయకూడదు



బచ్చన్నపేట : ఆరోగ్యంపై అందరూ శ్రద్ధ తీసుకోవాలని అనారోగ్యంపై అశ్రద్ధ చేయకూడదని సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో భవన నిర్మాణ రంగ కార్మికుల ఉచిత వైద్యపరీక్షల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ రామంచ సుమన్‌తో కలిసి మాట్లాడుతూ ఈ శిబిరంలో లేబర్ హెల్త్ కార్డు కలిగి ఉన్న వారందరూ దాదాపు 200 మంది వైద్యపరీక్షలను చేయించుకున్నారని అన్నారు. వారికి అవసరమైన పలు రకాల మందులను ఉచితంగా అందించామన్నారు. ఏవైనా ఆహారపదార్థాలను తినేటప్పుడు చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని అన్నారు. అర్హత కలిగి ఉండి లేబర్ కార్డు లేని కార్మికులు వెంటనే తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీసీ అఫ్రోజ్, సీఎస్‌సీ సిబ్బంది, ప్రజలు పలువురు పాల్గొన్నారు.

### పథకాలను సద్వినియోగం చేసుకోండి



లింగాలఘణపురం: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదలకు అందజేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యుబీఐ మేనేజర్ క్రాంతికుమార్ కోరారు. ఆదివారం మండలంలోని ఏనెబావిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం గ్రామీణ నిరుపేదలకు అందజేసే పథకాలపై యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పథకాలైన ఉజ్వల గ్యాస్, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, పీఎం జీవన్‌జ్యోతి, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సంవృద్ధి యోజన, జన్‌ధన్ అకౌంట్స్, పీఎం ముద్ర యోజన, భారతీయ జనఔషధ తదితర పథకాలను అవగాహన కల్పిస్తూ వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం శంకరయ్య, సీఎఫ్ఎల్ కౌన్సిలర్ రవివర్మ, సర్పంచ్ యాదలక్ష్మి, ఇండియన్ గ్యాస్ సిబ్బంది పాల్గొన్నారు.

### వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు

ధర్మసాగర్ : మండలంలోని కరుణాపురంలో వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు ఆ పార్టీ ఘన్‌పూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సంగాల ఇర్మియా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రార్థనలు చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఊరడి శ్రీనివాస్, రాజు, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

## కమీషన్లు తిరిగి ఇవ్వకుంటే తీవ్ర పరిణామాలు


మాట్లాడుతున్న జగదీష్‌చందర్‌రెడ్డి

రఘునాథపల్లి: దళితబంధు, గృహలక్ష్మి పథకం కోసం తీసుకున్న కమీషన్లను బీఆర్ఎస్ నాయకులు నెల రోజుల్లో తిరిగి ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కంచనపల్లిలో జరిగిన కాంగ్రెస్ గ్రామశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి అక్రమంగా 30 శాతం వసూలు చేసిన చిట్టా తమ వద్ద ఉందన్నారు. బాధితులకు ఆ మొత్తాన్ని బీఆర్ఎస్ నాయకులు ఇవ్వని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పంచాయతీ ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో పార్టీ అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిరకు త్వరలో ఉన్నత పదవి రానుందని ఆయన ఆకాంక్షించారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, జిల్లా నాయకులు గాదె మహేందర్‌రెడ్డి, తోటకూరి రమేష్, కావటి భాస్కర్, పేర్నె రవి, నీలం యువరాజ్, గొల్లూరి పృథ్వీరాజ్, రంగోజు ఈశ్వరయ్య, జానీ, వల్లాల పురుషోత్తం, సిదేశ్, రవి, మహేష్, శ్రీను, రాజు, హరీష్, ఎల్లగౌడ్, ఎలియా, శ్రీను, కిషన్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో అయోధ్య అక్షింతల ఊరేగింపు


అక్షింతలను ఊరేగింపు చేస్తున్న భక్తులు

బచ్చన్నపేట : అయోధ్య రామమందిరం నుంచి గ్రామాలకు వచ్చిన పసుపు, కుంకుమ అక్షింతలను మండలంలోని బండనాగారంలో ఆదివారం రాత్రి భక్తి శ్రద్ధలతో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి జంగిలి ఆంజనేయులు మాట్లాడుతూ అయోధ్యలో నిర్మిస్తున్న నూతన రామమందిరానికి గ్రామాల నుంచి పలువురు దాతలు చందాలను పంపించారని అన్నారు. వారి కోసం అయోధ్య నుంచి ఈ పసుపు, కుంకుమ, అక్షింతలను జనగామ జిల్లాకు పంపించగా వాటిని అక్కడి నుంచి అత్యంత భక్తి శ్రద్ధలతో గ్రామానికి తీసుకొచ్చామన్నారు. గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఉంచి ప్రత్యేక పూజలను నిర్వహించి హరేరామ హరే క్రిష్ణ అనే నామ నగర సంకీర్తనతో గ్రామంలో వాడవాడలా తిప్పామన్నారు. మహిళలు మంగళహారతులతో బిందెలలో నీళ్ల తెచ్చి పోసి కొబ్బరి కాయలను కొట్టారని అన్నారు. అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్లి శ్రీ రామలింగేశ్వరాలయంలో భద్రపర్చామన్నారు. కార్యక్రమంలో నర్సిరెడ్డి, రాములు, కిష్టయ్య, నారాయణ, బా లమ ల్లు, మల్లారెడ్డి, రామకృష్ణ, ధర్మయ్య పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప

బచ్చన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అన్నింటిని నెరవేర్చాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ మీద నమ్మకం ఉంచి ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను గెలిపించినందులకు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వడగళ్ల వర్షానికి నష్టపోయిన పంటలకు పరిహారాన్ని ఇప్పిస్తానని హామీ ఇచ్చారన్నారు. దేశంలో త్వరలో జరుగబోవు సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 400 పై చిలుకు సీట్లను గెలువబోతుందని అన్నారు. రాష్ట్రంలో దినదినాభివృద్ధి చెందుతున్న పార్టీ గణనీయంగా పార్లమెంటు సీట్లను గెలువబోతుందని, భువనగిరిలో ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకొని కాషాయ జెండా ఎగురవేస్తామన్నారు. అయోధ్యలో భవ్య రామ మందిర ప్రారంభోత్సవానికి ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని రామమందిర ట్రస్ట్ ఇచ్చినటువంటి నియమాల ప్రకారం నిత్య దీపారాధన చేయాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జూకంటి గణేష్, రాష్ట్ర నాయకులు దొంతుల చంద్రమౌళి, బంగారు మహేష్, గద్ద రాజు, నవీన్, అఫ్జల్, అభిషేక్ పలువురు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు వీధిలైట్లకు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..


గుమ్మడవెల్లిలో వీధిలైట్లను మరమ్మతు చేస్తున్న సిబ్బంది

లింగాలఘణపురం: మండలంలోని గుమ్మడవెల్లిలో పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లను రెండు రోజులుగా అధికారులు మరమ్మతు చేపట్టారు. నెల రోజులుగా పగలు రాత్రనక వెలుగుతున్న వీధిలైట్లపై ఈ నెల 8న 'సాక్షి'లో ఇదేనా విద్యుత్ ఆదా..? అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి రెడ్‌కో సంస్థ నిర్వాహకులు స్పందించి వీధిలైట్లకు ఆన్‌ఆఫ్ స్విచ్‌లు బిగించారు. అంతేకాకుండా వాటికి టైమర్లను ఏ ర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీ పాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో రోజుల నుంచి చెప్పినా స్పందించని అధికారులు సాక్షి కథనంతో స్పందించి రెండు రోజుల పాటు పూర్తిస్థాయిలో మరమ్మతు చేశారని, 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

# అధ్వానంగా రఘునాథ్‌పల్లి రోడ్డు

- ఎన్నో ఏళ్లవుతున్నా మరమ్మతుకు నోచుకోని వైనం
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు, వాహనచోదకులు
- మరమ్మతు చేయాలని వేడుకోలు


కూనూర్ నుంచి మట్టి రోడ్డుగా మారిన రఘునాథ్‌పల్లి రోడ్డు

జఫర్‌గఢ్ : మండలంలోని రఘునాథ్‌పల్లి రోడ్డు పూర్తిగా అధ్వానంగా తయారైంది. ఎన్నో ఏళ్ల క్రిందట కూనూర్ గ్రామం నుంచి రఘునాథ్‌పల్లి మీదుగా వెంకటాపూర్ క్రాస్ రోడ్డు వరకు వేసిన బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డు కంకర తేలి గుంతలుగా మారి మట్టి రోడ్డును తలపిస్తోంది. ఈ రోడ్డుపై ప్రయాణం సాగించే ప్రయాణికులు, వాహనచోదకులు నరకయాతన పడుతున్నారు. 2000 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కాజీపేట నుంచి వెంకటాపూర్ క్రాస్ మీదుగా రఘునాథ్‌పల్లి నుంచి కూనూర్ గ్రామం వరకు బీటీ రోడ్డును నిర్మించారు. ఇదేరోడ్డు మీదుగా జఫర్‌గఢ్ మండల కేంద్రం నుంచి కోనాయిచలం, కూనూర్, గర్మిళ్లపల్లి, తిడుగు, ఉప్పుగల్లు, సాగరం తదితర గ్రామాల ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు హనుమకొండ, కాజీపేట తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు నిత్యం ప్రయాణం సాగిస్తుంటారు, వాహనాల తాకిడితో పాటు ఇదే రహదారి గుండా నిత్యం ఇసుక ట్రాక్టర్లు నడుస్తుండడంతో రహదారి పూర్తిగా ధ్వంసమైంది. కూనూర్ నుంచి రఘునాథ్‌పల్లి మీదుగా వెంకటాపూర్ క్రాస్‌వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రోడ్డు అధ్వానంగా తయారు కావడంతో పాటు రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి పలుచోట్ల రోడ్డు పూర్తిగా మట్టి రోడ్డులా మారింది. దీంతో ప్రయాణికులతో పాటు వాహనచోదకులు, స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇదే రోడ్డు గుండా రైతులకు సంబంధించిన వ్యవసాయ బోరుబావులతో పాటు ఆకేరు వాగు ఉండడంతో రాత్రనక, పగలనక వ్యవసాయ బావుల వద్దకు రైతులు, మరో వైపు ఇసుక కూలీలు వెళ్తుండడంతో వారు నరకం చూస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళ్లలో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే. ఎక్కడ ఏ గుంతలో పడి ప్రమాదాలు కొని తెచ్చుకోవాల్సి వస్తుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా దెబ్బతిన్న రోడ్డును బాగు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

### దెబ్బతిన్న రోడ్డుతో ఇబ్బందులు



రోడ్డు దెబ్బతిని ఎన్నో ఏళ్లు అవుతున్నది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే నరకం చూడాల్సి వస్తున్నది. రఘునాథ్‌పల్లి, కూనూర్ మధ్య కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. – ఈగ కృష్ణమూర్తి, కూనూర్

### రోడ్డుపై ప్రయాణం నరకమే



రోడ్డు దెబ్బతిని ఏళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు గుండా ప్రయాణం చేయాలంటే నరకం చూడాల్సి వస్తున్నది. రోడ్డంతా గుంతలమయంగా ఉంది. – రమేష్, కూనూర్

## ఘనంగా ధనుర్మాస పూజలు ప్రారంభం


పూజలో పాల్గొన్న భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: ధనుర్మాసం ప్రారంభం సందర్భంగా ఘన్‌పూర్ శ్రీ తిరుమలనాథస్వామి దేవాలయం, శివునిపల్లి శ్రీలక్ష్మీ వేంకటేశ్వరాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ప్రధాన పూజారి కలకోట రామానుజచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోయుక్తంగా పూజలు చేపట్టారు. ధనుర్మాసం ప్రారంభం కావడంతో భక్తులు తెల్లవారుజాము నుంచే శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పూజారి మాట్లాడుతూ ధనుర్మాస ఉత్సవాలు, పూజలు జనవరి 14 వరకు కొనసాగుతాయన్నారు. ఈనెల 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.